# ‘మానుకోట ముఖ్యనేతల’తో నేడు కేసీఆర్ మీటింగ్

**పార్లమెంట్ అభ్యర్థి ఎంపికపై అభిప్రాయాలు సేకరించనున్న అధినేత**

మహబూబాబాద్, మార్చి 3(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక కోసం అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరై ఆయా నియోజకవర్గాల నేతల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే కొందరు నాయకులు హైదరాబాద్‌కు చేరుకోగా, మరి కొంతమంది సోమవారం వెళ్లనున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీతోపాటు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశంలోనే బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఎవరనేది వెల్లడి కానుంది.

# పాకాలలో బ్యూటిఫుల్ బర్డ్స



వైట్ రంప్డ్ షమా



ఇండియన్ ప్యారడైజ్ ఫ్లైకేచర్ (ఫిమేల్)

ఖానాపురం, మార్చి 3: పాకాల అభయారణ్యం అందమైన పక్షులకు నెలవుగా మారింది. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఔల్స్ ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ పక్షుల ఫొటోలు సేకరించారు. ఇండియన్ ప్యారడైజ్ ఫ్లైకేచర్ (మేల్, ఫిమేల్), బ్యాక్ న్యాప్డ్ మోనార్క్, వైట్ రంపుడ్ షమా, జెర్డాన్స్ లీఫ్ బర్డ్ వంటివి గుర్తించారు. పాకాల అభయారణ్యంలో 145 రకాల పక్షులు, 45 రకాల అటవీ జంతువులు ఉన్నాయని, వీటితోపాటు ఏటా వలస పక్షులు సీజనల్‌గా వస్తుంటాయని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు తెలిపారు. వన్య సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని పేర్కొన్నారు.



అమ్మవార్ల దర్శనానికి వస్తున్న భక్తులు

# వనదేవతల సన్నిధిలో కోలాహలం

- బారులు తీరిన భక్తులు
- జాతర ముగిసినా కొనసాగుతున్న మొక్కులు

తాడ్వాయి, మార్చి 3 : సమ్మక్క-సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో మేడారం పరిసరాలు కోలాహలంగా మారాయి. ఆదివారం సెలవు కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు పక్క రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుంటున్నారు. సమ్మక్క-సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపై పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు సమర్పించి సల్లంగా సూడు తల్లీ అని వేడుకుంటూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. అనంతరం తల్లులకు యాటపోతులు, కోళ్లను సమర్పించి జాతర పరిసరాల్లో వంటలు చేసుకుని విందు భోజనాలు చేస్తున్నారు. జాతర ముగిసినా తల్లుల దర్శనానికి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతర పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. గద్దెల పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆదివారం రెండు లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు తెలిపారు.

**స్నానాలకు నీళ్లు లేక ఇక్కట్లు**

భక్తులు పుణ్యస్నానాలు చేయడానికి జంపన్నవాగులో నీళ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. జాతర ముగియడంతో వాగులో భక్తుల కోసం ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను తొలగించారు. నీళ్లులేకపోవడంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాగులో నిలిచి ఉన్న మురుగు నీటిలోనే స్నానం చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. జంట వంతెనల వద్ద తాత్కాలిక బ్యాటరీ ఆఫ్‌ను దేవాదాయశాఖ అధికారులు ఏర్పాటు చేసేవారు. ఈసారి అధికారులు భక్తులకు సౌకర్యాలను కల్పించడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.



జంపన్నవాగు మురుగునీటిలో స్నానాలు చేస్తున్న భక్తులు



వేయిస్తంభాల గుడిలోని కళ్యాణమండపం

కాకతీయుల కాలం నాటి వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం పూర్వవైభవం సంతరించుకున్నది. నీటి ప్రవాహం వల్ల పునాదిలో ఇసుక కొట్టుకుపోయి స్తంభాలు కుంగిపోయి మండపం కూలే ప్రమాదం ఏర్పడడంతో కేంద్ర పురావస్తు శాఖ 2005లో దీని పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అనేక అడ్డంకులు, నిధుల కొరత, తదితర కారణాలతో జాప్యం జరుగగా ఎట్టకేలకు 19 ఏళ్ల తర్వాత పూర్తయ్యింది. ఇందుకోసం మొత్తం రూ.15కోట్లు వెచ్చించగా సాండ్‌బాక్స్ టెక్నాలజీని వినియోగించి తొలగించిన రాళ్లను పేర్చేందుకు శిల్పులు రేయింబవళ్లు శ్రమించగా, త్వరలో ప్రారంభించే అవకాశమున్నది.

- హనుమకొండ చౌరస్తా, మార్చి 3

సరికొత్తగా వేయిస్తంభాల కల్యాణ మండపం

# పూర్వవైభవం

- 19 ఏళ్ల తర్వాత పనులు పూర్తి
- రూ.15కోట్ల వ్యయంతో పునర్నిర్మాణం
- కాకతీయుల సాండ్‌బాక్స్ టెక్నాలజీ వినియోగం
- త్వరలో ప్రారంభానికి సన్నాహాలు

**రూ.15 కోట్ల వ్యయం**

కల్యాణ మండపానికి శిల్పులు తుది మెరుగులు దిద్దారు. తమిళనాడుకు చెందిన స్థపతి (వాస్తుశిల్పి) శివకుమార్ ఆధ్వర్యంలో 30మంది శిల్పులు నెల రోజులుగా రాత్రింబవళ్లు పనిచేశారు. స్తంభాలను తొలగించడానికి 2005లో రూ.3.50కోట్లతో పనులు ప్రారంభించారు. పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ బిల్లుల చెల్లింపులో జాప్యం చేయగా పనులు మధ్యలోనే నిలిచాయి. 15 ఏళ్ల తర్వాత 2021 నవంబర్‌లో పనులు పునః ప్రారంభించారు. నిధుల కొరత కారణంగా నత్తనడకన కొనసాగినట్లు సమాచారం. పునరుద్ధరణకు మొత్తం రూ.15కోట్లు వెచ్చించి ఎట్టకేలకు పనులు పూర్తిచేశారు.

**ప్రారంభానికి సిద్ధం**

వేయిస్తంభాల గుడి కల్యాణ మండపాన్ని పునః ప్రారంభించేందుకు కేంద్ర పురావస్తుశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో ఈ నెల 4 లేదా 5న ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అది కుదరకపోతే ఈ నెల 7న కేంద్ర మంత్రి అమిత్‌షా చేతులమీదుగా లేదా 8న మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించనున్నట్లు సమాచారం.



కాకతీయ సామ్రాజ్య కళావైభవానికి ప్రతీకగా 132 రాతి స్తంభాలు ఉండేవి. 1163లో రుద్రదేవుడు 850 ఏళ్ల క్రితం నిర్మించాడు. కాలక్రమంలో కల్యాణ మండపం బలహీనపడడంతో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) దాన్ని తొలగించింది. వేయిస్తంభాల గుడి కట్టడం చెక్కు చెదరలేదు కానీ దానికి ఎదురుగా ఉన్న ఈ కల్యాణ మండపం మాత్రం శిథిలావస్థకు చేరింది. దాని కింది నుంచి ప్రవహించిన నీటిపాయ ఇందుకు కారణమని గుర్తించారు. నీటి ప్రవాహం వల్ల పునాదిలో ఇసుక తొలగిపోయి రాతి స్తంభాలు కుంగి మండపం క్రమంగా పక్కకు ఒరిగిపోయింది. మండపం కూలే ప్రమాదం ఉందని గుర్తించిన కేంద్ర పురావస్తు శాఖ 2005లో పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పనులు చేపట్టిన తర్వాత అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. నిధుల కొరతతో పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు.

**సాండ్ బాక్స్ టెక్నాలజీతో..**

కల్యాణ మండపం పునర్నిర్మాణంలో కాకతీయుల అత్యంత సంక్లిష్టమైన సాండ్ బాక్స్ టెక్నాలజీనే అనుసరించారు. అంటే ఇసుకనే పునాదిగా చేసుకొని నిర్మాణం చేపట్టారు. కేంద్ర పురావస్తుశాఖ నిబంధనల ప్రకారం ఎక్కడా సిమెంట్, కాంక్రీట్, ఇనుము వాడలేదు. ఇసుకపై ఉన్న కట్టడాన్ని తిరిగి నిలబెట్టారు. కల్యాణ మండపం అడుగున 3 మీటర్ల లోతు మట్టి తొలగించి రాగడి మట్టి నింపి గ్రానైట్, ఇటుక, కరక్కాయలు, బెల్లం మిశ్రమంతో క్యూరింగ్ చేశారు. ఆ ఇసుక బేస్‌మెంట్‌పైనే రాళ్లను పేర్చారు. భూకంపాలు వచ్చినా కట్టడం చెక్కుచెదరకుండా రాళ్లకు రాళ్లను పట్టి ఉంచేలా స్టెయిన్‌లెస్ స్టీల్ పట్టీలు అమర్చారు. 3వేల శిలలు, గ్రానైట్ కళాఖండాలు, రాతి స్తంభాలు పాత కట్టడాన్ని తొలగించినప్పుడు వెలికితీసి క్రమ పద్ధతిలో నంబర్లు వేసి భద్రపరిచారు. కొన్ని స్తంభాలు పగిలిపోగా శిల్పులతో మళ్లీ చెక్కించారు.

*జయశంకర్ భూపాలపల్లి, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : వరి, మిర్చి, పత్తి, మక్కజొన్న వంటి సంప్రదాయ పంటల సాగుతో సంతృప్తి చెందని ఆ రైతు దీర్ఘకాలంగా లాభాలు తెచ్చిపెట్టే పంటలపై దృష్టిపెట్టాడు. వరంగల్ పరిశోధన కేంద్రంలో మెళకువలు తెలుసుకొని తనకున్న పదెకరాల్లో డ్రాగన్ ఫ్రూట్, శ్రీగంధం, మహాగని, తైవాన్ జామ, స్కై ఫ్రూట్, మల్బరీ లాంటి వైవిధ్యమైన పంటలు పండిస్తూ ప్రత్యేకత చాటుకుంటున్నాడు. అది కూడా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ అధిక లాభాలు గడిస్తున్నాడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాకపల్లికి చెందిన జంగిలి కృష్ణమూర్తి. వ్యవసాయంలో సరికొత్త ఒరవడి సృష్టిస్తూ ఉత్తమ రైతుగా అధికారుల మన్ననలు పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.*



కృష్ణమూర్తి సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోట

# సాగులో వైవిధ్యం దండిగా లాభం



అంతర పంటగా పసుపు

**దీర్ఘకాలిక పంటలకు కేరాఫ్ కృష్ణమూర్తి.. పదెకరాల్లో సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం**

**డ్రాగన్ ఫ్రూట్, శ్రీగంధం, మహాగని, తైవాన్ జామ, మల్బరీతోటల సాగుతో సత్ఫలితాలు**

**నేరుగా వినియోగదారులకు విక్రయాలు.. ఆదర్శంగా నిలుస్తున్న రేపాకపల్లి రైతు**



కృష్ణమూర్తి వ్యవసాయ క్షేత్రంలో శ్రీగంధం చెట్లు

కృష్ణమూర్తికి పదెకరాల భూమి ఉండగా మూడెకరాల్లో డ్రాగన్‌ఫ్రూట్ తోట వేశాడు. మొరాకన్ రెడ్ రకం ఫ్రూట్‌తో దిగుబడి ఎక్కువ వస్తుందని తెలుసుకొని కలకత్తా నుంచి 145 మొక్కలు తెప్పించాడు. ప్రత్యేకంగా పోల్స్ ఏర్పాటుచేసి వాటిని నాటాడు. ఎకరానికి సుమారు రూ.5లక్షల ఖర్చుతో పంట సాగుకు శ్రీకారం చుట్టాడు. నాటిన రెండో ఏట నుంచి కాత రావడం మొదలైంది. మూడు టన్నుల దిగుబడి రాగా ఐదో ఏట నుంచి ఎనిమిదిన్నర టన్నులకు పెరిగింది. జూన్ నుంచి డిసెంబర్ వరకు దిగుబడి వస్తూనే ఉంటుంది. ఈ ఆరు నెలల్లో వచ్చే క్రాప్‌తో అన్ని ఖర్చులు పోను రూ.5 లక్షల ఆదాయం ఆర్జిస్తున్నాడు. 20ఏళ్ల వరకు ఈ మొక్కలు ఫలాలు ఇస్తూనే ఉంటాయి. ముదిరిన డ్రాగన్ ఫ్రూట్ మొక్క కాండాలను కట్ చేసి భూమిలో నాటుతూ తోటను విస్తరిస్తున్నాడు.

**నేరుగా వినియోగదారులకే..**

తాను పండించిన డ్రాగన్ ఫ్రూట్ పంటను వ్యాపారులకు కాకుండా నేరుగా వినియోగదారులకే విక్రయిస్తూ అధిక లాభాలు గడిస్తున్నాడు. సేంద్రియ పద్ధతిలో పండిస్తుండడంపై సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వరంగల్, గోదావరిఖని, జమ్మికుంట, పరకాల, కరీంనగర్ నుంచి ఆర్డర్లు వెల్లువెత్తి రెగ్యులర్ కస్టమర్లు కూడా అయ్యారు. వాట్సాప్ ద్వారా ఆర్డర్ తీసుకుని ఆర్టీసీ కార్గో ద్వారా డ్రాగన్ ఫ్రూట్‌ను పార్సిల్ చేసి పంపిస్తున్నాడు. వ్యాపారులు కిలోకు రూ.150 చొప్పున విక్రయిస్తుండగా కృష్ణమూర్తి మాత్రం వినియోగదారులకు ఒక ఫ్రూట్‌కు రూ.100 నుంచి రూ.150 వరకు తీసుకుంటున్నాడు. కృష్ణమూర్తి ఉత్తమ రైతు అవార్డులతో పాటు రైతుబంధు సంబురాల్లో ప్రశంసా పత్రం అందుకున్నాడు.

**ఏడెకరాల్లో విభిన్న సాగు..**

కృష్ణమూర్తి తనకున్న మిగతా ఏడెకరాల్లోనూ దీర్ఘకాలిక పంటలు వేశాడు. శ్రీగంధం, మహాగని, తైవాన్ జామ, స్కై ఫ్రూట్, పసుపు, గుమ్మడి, మల్బరీ లాంటి విభిన్న పంటలు వేశాడు. ఐదేళ్ల క్రితం డ్రాగన్ ఫ్రూట్‌తో పాటే ఈ తోటలు సాగు చేయడం ప్రారంభించాడు. ఇప్పటికే మల్బరీ పంట కోతకు రాగా విక్రయించి రూ.5 లక్షల వరకు ఆదాయం ఆర్జించాడు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న శ్రీగంధం చెట్లు మరో 15 ఏళ్లకు చేతికందుతాయి. తైవాన్ జామ, స్కై ఫ్రూట్, గుమ్మడిని అంతర పంటలుగా సాగుచేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నాడు. ఇలా పదెకరాల్లో వైవిధ్యమైన పంటలను తనదైన శైలిలో పండిస్తూ ప్రత్యేకతను సొంతం చేసుకున్నాడు.

**మెళకువలు తెలుసుకొని ముందడుగు వేశా**



పత్తి, మిర్చి లాంటి సాధారణ పంటలు వేశా. దీర్ఘకాలికంగా అధిక ఆదాయం వచ్చే పంటలు వేయాలనుకున్నా. తెలిసిన అధికారులతో వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రానికి వెళ్లి పంటల గురించి నేర్చుకున్నా. వారి సలహాలతో డ్రాగన్ ఫ్రూట్‌ను ఎంచుకున్నా. ఎకరానికి రూ.5 లక్షల పెట్టుబడి అయింది. అప్పటినుంచి ఈ ఐదేళ్లలో వేప నూనె, పసుపు, కొబ్బరినూనె తదితర పదార్థాలను ఉపయోగిస్తూ సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నాం. మూడేళ్లుగా ఆరు నెలలకు అన్ని ఖర్చులు పోను రూ.5లక్షల ఆదాయం వస్తున్నది. నాకంటూ ప్రత్యేక కస్టమర్లు ఉన్నారు. క్రాప్ రాగానే ఫోన్లు చేస్తుంటారు. వారికి ప్యాక్ చేసి ఆర్టీసీ కార్గోలో పంపిస్తుంటా. ఏడెకరాల్లో శ్రీగంధం, మహాగని, మల్బరీ వేశా. మల్బరీ ఒక క్రాప్ తీశా. రూ.5 లక్షల దాకా ఆదాయం వచ్చింది. మరో 15 ఏళ్లలో శ్రీగంధం చేతికొస్తుంది.

– జంగిలి కృష్ణమూర్తి, రైతు

# ఐటీడీఏ పీవోగా మహిళా ఐఏఎస్

- ఐటీడీఏ చరిత్రలో తొలిసారి నియామకం
- నేడు విధుల్లో చేరనున్న చిత్రామిశ్రా



చిత్రా మిశ్రా

ఏటూరునాగారం, మార్చి 3 : ఐటీడీఏ చరిత్రలో తొలిసారి మహిళా ఐఏఎస్ పీవోగా నియమితులయ్యారు. ఫిబ్రవరి 12న జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో ఏటూరునాగారం పీవోగా చిత్రామిశ్రా బదిలీపై వచ్చారు. ఇక్కడ పీవోగా అంకిత్‌ను నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా బదిలీ చేయగా అక్కడ అదనపు కలెక్టర్‌గా ఉన్న 2019 బ్యాచ్‌కు చెందిన చిత్రామిశ్రాను ఏటూరునాగారం ఐటీడీఏకు బదిలీ చేశారు. అయితే అదే సమయంలో మేడారం జాతర జరుగుతున్న కారణంగా అంకిత్ జాతర పూర్తయ్యే వరకు కొనసాగారు. జాతర ముగిసిన తర్వాత వారం రోజుల పాటు మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఏఆర్‌వో ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. చిత్రామిశ్రా సోమవారం పీవోగా ఐటీడీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. 69మంది పీవోల తర్వాత రెగ్యులర్ పీవోగా మహిళా ఐఏఎస్ అధికారికి పనిచేసే అవకాశం దక్కింది.

1975లో ఐటీడీఏను ప్రభుత్వం నెలకొల్పింది. అదే ఏడాది జూలై 4న ఐఏఎస్ అధికారి ఎంవీ రంగారెడ్డిని తొలి పీవోగా నియమించారు. అప్పటినుంచి ఐటీడీఏ కార్యకలాపాలు మొదలయ్యాయి. ముందుగా వరంగల్ జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసినా తర్వాత ఏటూరునాగారానికి మార్చారు. సుమారు 49 సంవత్సరాలుగా గిరిజనుల అభివృద్ధి కోసం ఐటీడీఏ పనిచేస్తున్నది. కాగా, ఇప్పటివరకు 69 మంది ఐఏఎస్, నాన్ ఐఏఎస్‌లు పీవోలుగా పనిచేశారు. ఇందులో రెగ్యులర్ మహిళా ఐఏఎస్‌ను పీవోగా నియమించడం ఇదే తొలిసారి. 2007 ఫిబ్రవరి 2న నాన్ ఐఏఎస్ కేడర్‌కు చెందిన సుందర్ అబ్నార్‌ను పీవోగా నియమించారు. ఆయన 2010 సెప్టెంబర్ వరకు పనిచేశారు. ఆయన ఇక్కడ నుంచి బదిలీ కాగానే ములుగు ఆర్డీవోగా పనిచేస్తున్న శివారెడ్డికి ఐటీడీఏ పీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అప్పుడు జరిగిన ఓ ఘటనపై ఆ అధికారిని నాలుగు నెలలకే తొలగించారు. అత్యవసరంగా ఐటీడీఏకు పీవోను నియమించాల్సి ఉండగా వరంగల్ డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్న సుజాతశర్మకు రెండు నెలల పాటు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఇక ఐటీడీఏ చరిత్రలో ఒక్క మహిళా అధికారి రెగ్యులర్ పీవోగా పనిచేసిన దాఖలాలు లేవు. ఏటూరునాగారం ఐటీడీఏ పరిధి అతిపెద్దగా విస్తరించబడి ఉండడంతో మహిళా అధికారులను పీవోగా నియమించడం లేదని భావించేవారు. ఇప్పటివరకు ఐటీడీఏలో 69మంది పీవోలు పనిచేశారు. ఇందులో రెగ్యులర్ పీవోగా పనిచేసిన మహిళలు లేనే లేరు. ఒక్క రెండు నెలలు మాత్రం సుజాతశర్మ అదనపు బాధ్యతలతో పనిచేశారు. ఇక 70వ పీవోగా చిత్రామిశ్రాను నియమించారు.

# గుట్టలు ఎక్కి.. వాగులు దాటి..

**16 కి.మీ నడిచి వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేసిన వైద్య సిబ్బంది**



పెనుగోలు గ్రామంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న హెల్త్ అసిస్టెంట్ చిన్న వెంకటేశ్వర్లు

వాజేడు, మార్చి 3 : గుట్టలు ఎక్కి.. వాగులు దాటి.. 16 కి.మీ గ్రామానికి నడిచి వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు వైద్య సిబ్బంది. ములుగు జిల్లా వాజేడు పీహెచ్‌సీలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ చిన్నవెంకటేశ్వర్లు, ల్యాబ్ టెక్నీషియన్ లాకన్, గ్రామస్తుడు ధర్మయ్యను తోడుగా తీసుకొని ఆదివారం ఉదయం బయలుదేరి వెళ్లారు. మూడు గుట్టలు ఎక్కి, మూడు వాగులు దాటి 16 కిలోమీటర్ల దూరంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దులో ఉన్న పెనుగోలు గ్రామానికి నడిచివెళ్లి అక్కడ ఇద్దరు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అలాగే గ్రామస్తుల నుంచి రక్త నమూనాలు సేకరించి వారికి మందులను అందించారు. సాయంత్రం మండల కేంద్రానికి చేరుకున్న హెల్త్ అసిస్టెంట్ చిన్నవెంకటేశ్వర్లుతో పాటు ల్యాబ్ టెక్నీషియన్ లాకన్‌ను పలువురు మండల వాసులు, వైద్యాధికారి, తోటి వైద్య సిబ్బంది అభినందించారు.